క్లుప్తంగా

దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

సైదాపూర్: తెలంగాణ తొలి రైతాంగ పోరాట యోధుడు కురుమ కుల ఆణిముత్యం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కురుమ యువ చైతన్య సమితి మండల అధ్యక్షుడు వెంగల రవి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్ మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్



ట్రోఫీ అందజేస్తున్న రాజేశ్వర్‌రావు, తదితరులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట 14వ వార్డుకు చెందిన బంటు పవన్ ఇటీవల గుండె పోటుతో మృతిచెందగా అతని స్నేహితులు స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. జమ్మికుంటకు చెందిన 13, 14 వార్డుల యువకులు పోటీలో పాల్గొన్నారు. మూడు రోజులుగా నిర్వహించిన పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో 13వ వార్డు యువకులు గెలుపొందారు. విన్నర్ టీమ్‌కు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, స్థానిక కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, నాయకుడు బోగం వెంకటేశ్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం గెలుపొందిన టీమ్‌కు ట్రోఫీని అందించారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పద్మశాలీ సంఘం ఎన్నికలు



పోలింగ్‌లో ఓటర్లు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో ఆదివారం మండల పద్మశాలీ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలకు పద్మశాలీ కుల బాంధవులు భారీగా తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా పోలీసు బందోబస్తు సమకూర్చిన హుజూరాబాద్ సీఐ తిరుమల్ గౌడ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, ఉపాధ్యక్షుడు వేముల యాదగిరి, ఎన్నికల ఆఫీసర్లుగా కొనసాగిన సబ్బని శివాజీ, రవీందర్, ఎలగందుల వెంకటేశ్వర్లు తదితరలకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నగదు అందజేత



నగదు అందిస్తున్న పొదుపు సంఘం సభ్యులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో ఆదివారం మృతుడి కుటుంబానికి పురుషుల పొదుపు సంఘం సభ్యులు బీమా డబ్బులు అందించారు. పురుషుల పొదుపు సంఘం సభ్యుడు పూదరి శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. సంఘం నుంచి సామూహిక బీమా క్లెయిమ్ నుంచి రూ.60 వేలు మృతుడి భార్య రేణుకకు అందజేశామని సంఘం సభ్యుడు కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజిరెడ్డి, శ్రీనివాస్, సంపత్, ఎల్లయ్య, మొగిళి, ఆనందరెడ్డి, చంద్రమౌళి, ఓదెలు, శ్రీనివాస్, రమేశ్, రఫీ పాల్గొన్నారు.

బంగారు రుణాలు మాఫీ చేయాలి

గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేయడం సంతోషకరం, కానీ బ్యాంకులో పట్టా పాసుబుక్‌తో బంగారం కుదువ పెట్టిన రుణాలు మాఫీ కాలేదని బ్రిడ్జి సాధన కమిటీ(జేఏసీ) అధ్యక్షుడు సంపతి ఉదయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మాదాపూర్ గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ పనుల నిమిత్తం బ్యాంకుల్లో బంగారం కుదువపెట్టి రూ.రెండు లక్షలపైగా రుణాలు తీసుకున్నారని, వారికి మాఫీ వర్తించలేదని, బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లినా లాభం లేకుండాపోయిందని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం రుణమాఫీ పరిధిలోకి తీసుకోవాలని కోరారు.

జీరో కరెంట్ బిల్‌కు సవరణ

శంకరపట్నం: గృహాలకు సంబంధించి జీరో కరెంట్ బిల్ సవరణకు మంగళవారం నుంచి మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు, ఇతర కారణాలతో ఆన్‌లైన్లో నమోదు కానీ కారణాలతో జీరో కరెంట్ బిల్ రాని ప్రజలు సవరణ చేసుకోవాలని సూచించారు. సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

సైదాపూర్ మండలంలో 3 కొత్త జీపీలు

- అభివృద్ధి, పాలన సౌలభ్యానికి..
- గర్రెపల్లి, గొల్లగూడెం, కురుమపల్లి జీపీల ఏర్పాటుకు గెజిట్ విడుదల
- త్వరలో ప్రక్రియ షురూ, మండలంలో 30కి చేరనున్న జీపీలు



వెన్కెపల్లి-సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయం



సైదాపూర్ మండలం మ్యాప్

సైదాపూర్: మండలంలో మరో మూడు కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. సోమారం పంచాయతీ పరిధిలోని గర్రెపల్లి, రాంచంద్రాపూర్ పంచాయతీ పరిధిలోని కురుమపల్లి, పెరుకపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి కొత్త గ్రామ పంచాయతీకి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. జిల్లాల పునర్విభజనలో సైదాపూర్ మండలం కరీంనగర్ జిల్లాలో, హుస్నాబాద్ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాలో ఉంది. రెవెన్యూ డివిజన్ హుజూరాబాద్‌లో ఉంది. ఉట్టికి స్వర్గానికి అందని చందంగా సైదాపూర్ మండల పరిస్థితి ఉందని జిల్లాలు ఏర్పడినప్పటి నుంచి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల జనాభా సుమారు 40 వేలు, ఓటర్లు 30,354, గతంలోనే 26 గ్రామ పంచాయతీలుండగా అప్పుడే గర్రెపల్లి, గొల్లగూడెం జీపీలు కాలేకపోయాయి. గత ప్రభుత్వం గర్రెపల్లి, గొల్లగూడెంతో పాటు రాంచంద్రాపూర్ జీపీ పరిధిలోని కురుమపల్లిని పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ గెలిచి రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి అయ్యారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సిద్దిపేట నుంచి కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. మంత్రి ప్రభాకర్ కొత్త జీపీల ఏర్పాటుకు ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి గెజిట్ విడుదల చేయించారు. గర్రెపల్లిలో జనాభా 521, 372 ఓటర్లు, 487 ఎకరాల విస్తీర్ణం, సోమారం పంచాయతీకి రెండు కిలోమీటర్ల దూరం. గొల్లగూడెంలో జనాభా953 , 680 ఓటర్లు, 700 ఎకరాల విస్తీర్ణం, పెరుకపల్లి పంచాయతీకి రెండు కిలోమీటర్ల దూరం. కురుమపల్లిలో జనాభా 650, 400 ఓటర్లు, 3000 ఎకరాల విస్తీర్ణం, రామచంద్రాపూర్‌కు కిలోమీటర్ల దూరం. కొత్త జీపీల ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి. పెరుగుతున్న పంచాయతీల కారణంగా గత రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉంది. గ్రామాల అభివృద్ధి, పరిపాలన సౌలభ్యం కోసం దూరం, జనాభా, ఓటర్ల ప్రతిపాదికన కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటైతే గ్రామాలు మరింత పురోగతి సాధిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో గవర్నర్ ఆమోదంతో గెజిట్ విడదలైనట్లు తెలిసింది. బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి కూడా నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటుకు మంత్రి ప్రతిపాదించారు. దీంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 30కి చేరనుంది. నూతన పంచాయతీల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పాలకులు పట్టించుకోవడంలేదు



సోమారం జీపీ పరిధిలో బూడిదపల్లి, గర్రెపల్లి, పసికపల్లి గ్రామాలు ఉన్నాయి. సోమారం పరిధిలో గర్రెపల్లి అభివృద్ధికి నోచుకోలేదు. గర్రెపల్లికి ఇప్పటికీ మట్టి రోడ్లున్నాయి. సోమారం, బూడిదపలి నుంచి ఎన్నికవుతున్న పంచాయతీ పాలకులు గర్రెపల్లిని పట్టించుకోవడంలేదు. గర్రెపల్లి చిరకాల కోరిక తారురోడ్డు అయినప్పటికీ, గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే మా గ్రామాన్ని మేమే బాగు చేసుకుంటాం.

– వేముల కొమురయ్య, మాజీ వార్డు సభ్యుడు, గర్రెపల్లి

గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం



పెరుకపల్లి నుంచి గొల్లగూడెంను జీపీ చేస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం. ఒకే పంచాయతీతో అభివృద్ధి పనుల్లో అభ్యంతరాలు ఉండవు. ఒక జీపీ లో రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామాలుంటే పనులకు ఆటంకాలు ఏర్పడుతాయి. ఎప్పటి నుంచో గ్రామ పంచాయతీ కావాలని డిమాండ్ చేస్తున్నాం. గత పాలకులు రెండుసార్లు కాకుండా చేశారు. ఈసారి పంచాయతీగా ఏర్పాటైతే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

– బత్తుల కొమురయ్య, మాజీ సర్పంచ్, గొల్లగూడెం

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుమల్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రవి

హుజూరాబాద్‌రూరల్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ పట్టణ సీఐ తిరుమల్ అన్నారు. ఆదివారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అనవసర లింకులు క్లిక్ చేయొద్దని, ఓటీపీలు చెప్పొద్దన్నారు. యువత గంజాయి, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ యూనీస్, పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి కేశవపట్నం ఎస్సై రవి వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి సరైనా పత్రాలు, నంబర్‌ప్లేట్ సరిగాలేని వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో ఏఎస్సై సుధాకర్,సిబ్బంది ఉన్నారు.

ధర్మజాగరణ ఆధ్వర్యంలో రక్షాబంధన్



ప్రణవ్‌కు రాఖీ కడుతున్న వైస్ చైర్మన్ దేశిని స్వప్న

గంగాధర: మండలంలోని గంగాధర, కోట్ల, నర్సింహులపల్లి, నాగిరెడ్డిపూర్ గ్రామాల్లో ఆదివారం ధర్మజాగరణ గంగాధర ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మజాగరణ సభ్యులు ఇంటింటికీ తిరిగి రాఖీలు కట్టారు. నీకు నేను రక్షా, నాకు మీరు రక్షా మనందరం దేశానికి రక్షా అంటూ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ధర్మజాగరణ సభ్యులు మాడిశెట్టి గంగాధర్, గంగాధర రవి, మొగిలితిరుపతి, శేఖర్,తోట వెంకటేశ్, ఇరుగురాళ్ల రవి, మొగిలి, దోమకొండ నర్సయ్య, మల్లేశం, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబుకు ఆయన నివాసంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి ఆదివారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యాచార దుండగులను శిక్షించాలి



హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో శాంతిర్యాలీ



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో..

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం శాంతి ర్యాలీలు నిర్వహించారు. మహిళలపై పెరిగిపోతున్న హత్యాచారాలను వెంటనే అరికట్టి రక్షణ కల్పించాలని, కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ మృతిపై సీబీఐ దర్యాప్తు వేగవంతం చేసి హత్యాచార దుండగులను శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలన్నారు. ప్రాణం పోసే వైద్యులకే రక్షణలేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. మెడికల్, నర్సింగ్ కాలేజీలో వసతులపై ఆరా తీయాలన్నారు. నిందితులకు శిక్షలు పడేవరకు పార్టీలతో సంబంధం లేకుండా పోరాడాలని రాజకీయ నాయకులను కోరారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు



తిమ్మాపూర్: ద్విచక్ర వాహనంపై కోడి గుడ్లు విక్రయించే వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఎస్.కె.ఫారూఖ్ తన ద్విచక్ర వాహనంపై ఇంటింటికీ తిరుగుతూ కోడిగుడ్లు అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలా ఆదివారం కూడా తన ద్విచక్ర వాహనంపై కోడిగుడ్లు అమ్మడానికి బయలుదేరాడు. ఇందిరానగర్ గ్రామ సమీపంలో రాజీవ్ రహదారిపై కరీంనగర్ వైపు వస్తుండగా.. ఓ లారీ ఫారూక్ ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఫారుక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ లారీ ఆపకుండా పారిపోయే ప్రయత్నం చేయగా.. స్థానిక యువకులు బైక్‌పై వెంబడించి పట్టుకున్నారు. స్థానికుల ద్వారా సమాచారమందుకున్న ఎల్ఎండీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

సర్వాయి పాపన్న జయంతి



అల్గునూరులో పాపన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

చొప్పదండి/ఇల్లందకుంట/జమ్మికుంట/మానకొండూర్/సైదాపూర్/శంకరపట్నం/హుజూరాబాద్‌రూరల్/గన్నేరువరం/గంగాధర/రామడుగు/ చిగురుమామిడి/తిమ్మాపూర్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రజాకారులపై పోరాడిన పాపన్న చరిత్రను కీర్తించారు. బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన పాపన్న ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. పాపన్న ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆయన పోరాటం యువతకు స్ఫూర్తి అని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అల్గునూర్ చౌరస్తాలోని మానేర్ బ్రిడ్జిని అనుకొని ఉన్న పాపన్న విగ్రహం వద్ద తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జయంతిలో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

గన్నేరువరం: రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కొర్రీలు పెట్టి రాష్ట్రంలో లక్షలాది మందికి రుణమాఫీ చేయలేదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. రుణమాఫీతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని విమర్శించారు. జిల్లాలో వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆందోళన చెందుతున్నారని, ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రగల్బాలు పలికి, మూడు విడుతల్లో కూడా పూర్తి చేయలేకపోయారని అన్నారు. కేవలం రైతు భరోసా సాయం ఎగ్గొట్టడానికి, రుణమాఫీ అంశాన్ని ముందుపెట్టి కాంగ్రెస్ సర్కార్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని, 20న జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసనలు, రచ్చబండ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పారువెల్ల పాలనురగలు



గన్నేరువరం: ఇటీవల వర్షాలకు మండలంలోని పారువెల్ల గ్రామం పెద్ద చెరువు అలుగు పారుతోంది. ఈ ఏడాది అలుగుపారిన మొదటి చెరువుగా నిలిచింది. మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో చెరువులు బోసి పోతున్నాయి. ఈ క్రమంలో పారువెల్ల చెరువు మత్తడి దూకుతుండటంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరదనీరు గన్నేరువరం పెద్ద చెరువులోకి చేరుతోంది. రెండు రోజుల్లో ఈ చెరువు సైతం అలుగుపారే అవకాశం ఉంది.

రైల్వే సమాచారం

జమ్మికుంట నుంచి ప్రతిరోజు నడిచే రైళ్ల సమాచారం

జమ్మికుంట నుంచి కరీంనగర్, బల్లార్షా(ఎగువ) వైపు..		
12761:	తిరుపతి-కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(గురు, ఆదివారాలు)	05.26 గంటలకు
17003:	రామగిరి ఎక్స్‌ప్రెస్-కాజీపేట్-సిర్పూర్ టౌన్	06.05 గంటలకు
17011:	ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	07.55 గంటలకు
17033:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్-భద్రాచలం రోడ్ టూ బల్హర్షా	10.01 గంటలకు
12757:	కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	10.43 గంటలకు
12721:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ హాజరాయ్ నిజామోద్దీన్	(రాత్రి)1.44 గంటలకు
12771:	రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ రాయ్‌పూర్ జంక్షన్	(రాత్రి)1.04 గంటలకు
12791:	ధానాపూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ ధానాపూర్	11.34 గంటలకు
16093:	లక్నో ఎక్స్‌ప్రెస్(బుధ, శని)-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో జంక్షన్	18.08 గంటలకు
16031:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, బుధ, గురువారాలు)- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో	18.08 గంటలకు
17233:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	18.25 గంటలకు
17035:	కాజీపేట్ బల్హర్షా ఎక్స్‌ప్రెస్-కాజీపేట్ టూ బల్హర్షా	23.18 గంటలకు
12592:	యశ్వంత్‌పూర్ టూ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్(మంగళవారం)	08.55 గంటలకు
జమ్మికుంట నుంచి కాజీపేట్, వరంగల్(దిగువ) వైపు..		
12772:	రాయ్‌పూర్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-రాయ్‌పూర్ టూ సికింద్రాబాద్	04.11 గంటలకు
17234:	భాగ్యనరగ్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	05.44 గంటలకు
17036:	బల్హర్షా కాజీపేట్ ఎక్స్‌ప్రెస్-బల్హర్షా టూ కాజీపేట్	07.20 గంటలకు
17012:	ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	13.55 గంటలకు
17034:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సిర్పూర్‌టౌన్ టూ భద్రాచలం రోడ్	14.45 గంటలకు
16032:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, సోమ, గురు)- శ్రీమాతా వైష్ణోదేవి కత్రా టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	15.34 గంటలకు
16094:	లక్నో ఎక్స్‌ప్రెస్ (మంగళ, శుక్ర)- లక్నో జంక్షన్ టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	16.09 గంటలకు
12758:	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	16.30 గంటలకు
12792:	సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-దానాపూర్ టూ సికింద్రాబాద్ 1	7.42 గంటలకు
12722:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-నిజామోద్దీన్ టూ హైదరాబాద్ జంక్షన్	23.19 గంటలకు
17004:	రామగిరి ఎక్స్‌ప్రెస్-బల్హర్షా టూ కాజీపేట్	19.09 గంటలకు
12762:	కరీంనగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్(గురు, ఆది) కరీంనగర్ టూ తిరుపతి	20.24 గంటలకు
12591:	గోరఖ్‌పూర్ టూ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(ఆదివారం)	10.09 గంటలకు



మానకొండూర్: మండల కేంద్రంలోని విశాల సహకార సంఘ కార్యాలయం సమీపంలో మానకొండూర్, వేగురుపల్లి రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు రాత్రి వేళ ప్రయాణం చేయదానికి జంకుతున్నారు. వెల్డి వరకూ అడుగుఅడుగునా గుంతలతో అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి,
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్ 94408 18867

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 87901 44227



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హుజూరాబాద్/జమ్మికుంట: హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల 1999-2001 విద్యా సంవత్సరం బైపీసీ విద్యార్థులు, జమ్మికుంట పట్టణంలోని కాకతీయ పాఠశాల 2003-04 పదో విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం చదువు చెప్పిన అధ్యాపకులు సమ్మయ్య, ప్రభాకర్‌రావు, మొండయ్య, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటాచారి, మండల సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, లత, మారబోయిన వేణుమాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, జగన్, కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు ప్రభాకర్, విజయభాస్కర్, శ్రీనివాస్, రాజేందర్, లక్ష్మణ్, భాస్కర్, వీరప్రసాద్, శ్రీనివాస్‌రావు, కొండాల్‌రెడ్డి, రాజు, ప్రవీణ్‌ను సన్మానించారు.

